క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఉచిత న్యాయసహాయం



బి.లక్ష్మీకాంత్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకాన్ని ఉంచి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమించారని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, అలాగే కార్యకర్తలకు ఉచితంగా న్యాయసహాయం అందించేందుకు కృషి చేస్తానని బి.లక్ష్మీకాంత్ తెలిపారు. స్థానిక సివిల్ జూనియర్ జడ్జి కోర్టు ఆవరణలో గురువారం ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాయుజోహోత్తంరావు, షేక్షావలి ఆధ్వర్యంలో బి.లక్ష్మీకాంత్‌ను సన్మానించారు.. తన ఎంపికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బుసినే విరూపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు యుగంధర్ ,విజయ్‌భాస్కర్, రాజేష్ నాయుడు, వెంకటేష్ ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



ఆస్పరిలో మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య

ఆస్పరి: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తేలేదన్నారు. గొడవలకు పోకుండా కలిసి మెలిసిగా ఉండాలని సూచించారు. ఆస్పరి సీఐ మస్తాన్ వలి ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: ఈనెల 20న అనారోగ్యంతో మృతి చెందిన పట్టణానికి చెందిన ముత్యాల బాబురావు కుటుంబానికి అయనతో పాటు స్థానిక హైస్కూల్‌లో పదవ తరగతి వరకు చదివిన 2004–05 బ్యాచ్ మిత్రులు తమ వంతు ఆర్థిక సాయం అందించారు. వారంతా కలిసి సేకరించిన రూ.30వేల నగదును గురువారం ఆ కుటుంబానికి అందజేసి, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

మార్కెట్ సముదాయం పంచాయతీకి అప్పగింత



ధ్రువపత్రాలు అందజేస్తున్న నవయూత్ అసోసియేషన్ సీఈఓ నరసింహులు

మద్దికెర : స్థానిక ప్రధాన బజారులో నాబార్డు నిధులు రూ.15 లక్షలు, పంచాయతీ నిధులు రూ.3 లక్షలు, దాత వెంకటేశ్వర్‌రెడ్డి అందించిన రూ.3 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ సముదాయాన్ని పంచాయతీకి అప్పగిస్తున్నట్లు నవయూత్ అసోసియేషన్ సీఈఓ నరసింహులు తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలను సర్పంచ్ బండారు సుహాసిని, ఈఓ శివకుమార్‌కు అందజేశారు. కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

ఆలూరు: మండలంలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడ తలెత్తకుండా అన్ని చర్యలను సంబంధిత గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ వై.ప్రభాకర్ తెలిపారు. గురువారం సర్పంచ్‌లతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిల్ కలెక్టర్ నవీన్, మేస్త్రీ లక్ష్మన్న ఉన్నారు.

గుండెపోటుతో విలేకరి మృతి

వెల్దుర్తి: పట్టణానికి చెందిన సీనియర్ విలేకరి బోయ హనుమంతు (63) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విశాలాంధ్ర మండల విలేకరిగా దాదాపు 20 ఏళ్ల సేవలందించిన ఈయన ఇటీవల కర్నూలు జిల్లా రిపోర్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కర్నూలులోనే నివాసముంటూ రాత్రి నిద్రలో గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతిపై మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సమీర్ కుమార్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రాతపై పట్టు.. మార్కులు రాబట్టు

- పరీక్షల్లో మార్కులపై ప్రభావం చూపుతున్న చేతిరాత
- పది, ఇంటర్ పరీక్షలకు ఆసన్నమైన సమయం
- విద్యార్థులు దస్తూరిపై సాధన చేయాలంటున్న నిపుణులు

కృష్ణగిరి: పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. అత్యుత్తమ మార్కులు సాధించాలనే లక్ష్యంతో అనేక మంది విద్యార్థులు ఓ ప్రణాళికను సైతం రూపొందించుకుని చదువుతున్నారు. ఏడాది పాటు చదివిన విషయాలు జవాబు పత్రంపై రాసే విధానం వల్ల కూడా మార్కులు ఆధారపడి ఉంటాయి. అయితే ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించే విద్యార్థులు తక్కువ మంది మాత్రమే ఉంటారు. విద్యార్థులు పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో చేతిరాత కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చేతిరాత బాగుంటే మూల్యాంకణం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు లభిస్తాయి. చేతిరాత బాగలేకపోతే మూల్యాంకనం చేసే వారికి సమాధానం అర్థం కాక మార్కులు తగ్గే అవకాశం ఉంటుంది. ఇది ఫలితాలపై ప్రభావం చూపుతుంది. అందువల్ల విద్యార్థులు చేతిరాతను మెరుగు పరుచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెబుతున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలకు 36 రోజులు, పది పరీక్షలు 55 రోజుల సమయం మాత్రమే ఉంది. పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది పదో తరగతి 4,145 మంది విద్యార్థులు, ఇంటర్‌లో దాదాపుగా 2వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు రోజుకు అర గంట చేతిరాతపై సాధన చేయాలని నిపుణులు పేర్కొంటున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17–31 వరకు నిర్వహిస్తారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు మార్చి 1–19 వరకు, సెకండియర్ పరీక్షలు మార్చి 3–20 వ తేదీ వరకు జరుగుతాయి.



సాధనతో ఇలా అందమైన దస్తూరి సాధ్యం

పరీక్షలు ఇలా రాయాలి..

- జవాబు పత్రంలో సమాధానాలు స్పష్టంగా రాయాలి.
- ఒక లైన్, మరొక లైన్‌కు సెంటీమీటర్ గ్యాప్ ఉండేలా చూసుకోవాలి.
- పదానికి, పదానికి తగినంత దూరం ఇవ్వాలి.
- బుక్‌లెట్‌లో వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో రాయాలి.
- బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది. అక్షరాలు గుండ్రంగా కుదురుతాయి.
- మనస్సు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తుంది.
- పేజీ ఎడమ వైపు ఒకే చోటు నుంచి జవాబు రాయడం ప్రారంభించాలి. పై నుంచి కింది వరకు అదే పద్ధతి పాటించాలి.
- సమాధానం సూటిగా.. స్పష్టంగా రాయాలి.
- ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా రాస్తే పేజీ అందంగా కనిపించడంతో మార్కులు అదనంగా లభిస్తాయి.
- బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాయాలి.
- బుక్‌లెట్ మొత్తం ఒకే విధంగా రాయాలి.

- పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. విశ్రాంతి లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై పడుతుంది.

సాధన తప్పనిసరి



చక్కటి చేతిరాత సాధనతోనే సాధ్యం కాగలదు. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను గుండ్రంగా రాసేందుకు సమయం కేటాయించుకొని సాధన చేయాలి. చాలా మంది తొలి ప్రశ్నకు గుండ్రటి అక్షరాలతో సమాధానం రాస్తారు. ఆ తరువాత సమయం అయిపోతుందన్న ఆందోళనతో వేగంగా రాయడం ప్రారంభిస్తారు. అందువల్ల గుండ్రటి అక్షరాలు కుదరవు. ఈ ప్రభావం మార్కులపై పడుతుంది. సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనసరి. మా పాఠశాలలో విద్యార్థులకు దీనిపై సాధన చేయిస్తున్నాం.

– శివప్రసాద్, ఇంగ్లిష్ టీచర్, జెడ్పీ హైస్కూల్, కంబాలపాడు

పేరుకే పశు వైద్యశాల

- మూగజీవులకు సక్రమంగా అందని వైద్యసేవలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

చిప్పగిరి: కొందరు పశువైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో మూగజీవులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. గురువారం స్థానిక పశువైద్యశాలలో మధ్యాహ్నం 2 గంటలైనా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి పశువులతో వచ్చిన పలువురు రైతులు పశువైద్యశాలకు వచ్చి వెనుదిరిగారు. కార్యాలయం ప్రధాన తలుపు మాత్రం తెరచి వైద్యుల గది తలుపు మూసి ఉంచడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు లేనప్పుడు ప్రధాన తలుపు కూడా ఎందుకు తెరిచి ఉంచారని ప్రశ్నించారు. నిత్యం ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విధుల్లో ఉండే తేదీలను ప్రదర్శిస్తే సరిపోతుంది కదా అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మూగజీవులకు వైద్యం అందుబాటులోకి తేవాలని కోరారు.



చిప్పగిరిలో తెరుచుకోని పశువైద్యశాల



పత్తికొండలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మహనీయుడు నేతాజీ

పత్తికొండ రూరల్ : జైహింద్ అనే నినాదాన్ని భారత జాతికి అందించిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు బి.రంగస్వామి అన్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సత్యనారాయణ, నరసింహయ్యాచారి, మల్లికార్జున, నగేష్, సుధాక్రిష్ణ, జటంగిరాజు పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక నేతాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల హెచ్ఎం గోపీనాథ్, కరెస్పాండెంట్ మల్లికార్జున తదితరులతో పాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో నేతాజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన నేతాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



హొళగుందలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దేవనకొండ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ స్కూల్స్ కరస్పాండెంట్, వివిధ పార్టీల నాయకులు ఉచ్చీరప్ప, రామాంజనేయులు మాట్లాడుతూ సుభాష్ చంద్రబో స్వాతంత్ర్య సమరంలో ఆయన ఎంచుకున్న మార్గం నాడు యువతలో స్ఫూర్తి నింపి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేటట్లు చేసిందన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పత్తికొండ రూరల్ : రైతులు పండించిన పంట విక్రయాలకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏవో ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో 10వేల ఎకరాల వరకు కంది సాగైందని, పంట చేతికొచ్చే సమయానికి తుఫానుతో దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లకు తగినట్లుగా రైతులు పండించిన ప్రధాన పంటల కొనుగోలుకు స్థానికంగానే కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కందికి రూ.7,550 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, రాజేశ్వరరెడ్డి, నారాయణ, సీఐటీయు సెక్రెటరీ గోపాల్, మహబుబ్‌బాషా, సుకప్ప పాల్గొన్నారు.



పత్తికొండ ఆర్డీఓ కార్యాలయంలో ఏవో ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆస్పరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సుంకుర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించున్నట్లు గురువారం ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

30న మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహన్‌బీ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను ఒక రోజు ముందుగానే కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

26న టెంకాయల విక్రయానికి వేలం

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా టెంకాయలను అమ్ముకోవడానికి ఈనెల 26వ తేదీన వేలం నిర్వహించునున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు అదే రోజు డిపాజిట్ చెల్లించాలన్నారు. వివరాలకు సెల్ 9705107987, 6304167849 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

తుగ్గలి : ఏపీ ఈఎస్ఎఫ్‌టీ, ఈఎస్‌టీఎఫ్ బృందాలు, పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరావు ఆధ్వర్యంలో తండాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. మండలంలోని రోల్లపాడు,పత్తికొండ మండలం బుగ్గతండా సమీపంలోని సారా స్థావరాలపై దాడులు చేసి 1,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రోల్లపాడులో సీఐ గ్రామసభ నిర్వహించి నాటుసారాతో కలిగే అనర్థాలను వివరించారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కోమలాదేవి

ఆలూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆలూరు ఎంఈఓ కోమలాదేవి సూచించారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో పది పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఎస్టీయూ, ఏపీ అకాడమిక్ వారు రూపొందించిన ఎస్సెస్సీ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఎంఈఓ–2 చిరంజీవిరెడ్డి , ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగరాజ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకు ముందు స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మద్దికెర : పదిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓలు రంగస్వామి, గోపాల్ అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా విద్యాలయం, బీసీ వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థులకు డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన డాక్టర్ వీఆర్ యాదవ్ అందజేసిన స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ ద్వారా అందజేశారు. ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు విశ్వనాథ్, ఎంజీ నాగరాజు, రంగన్న, మంజునాథ్ పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

హాలహర్వి: చలి తీవ్రంగా ఉన్నందున ప్రజలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ తిమ్మయ్య సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు, ఆరోగ్య సిబ్బందికి ఆరోగ్య విషయాలపై సూచనలిచ్చారు.ఆయన మాట్లాడుతూ మూడు రోజుల నుంచి చలి తీవ్రత ఎక్కువగా ఉందని, శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. చలికాలంలో వృద్ధులు, చిన్నారులు బయట తిరగకపోవడం మంచిదని, తప్పనిసరైతే తలకు మఫ్లర్, మంకీ టోపీలు, ముఖానికి మాస్కులు ధరించి వెళ్లాలన్నారు.అలాగే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు.

విద్యుత్ వైరు చోరీ

వెల్దుర్తి: స్థానిక పంచాయతీ నీటి పథకానికి చెందిన విద్యుత్ మోటారు వైరు చోరీకి గురైనట్లు పంచాయతీ అధికారి లక్ష్మీనాథ్ తెలిపారు. పట్టణానికి తాగునీరందించే బ్రహ్మగుండం పథకానికి సంబంధించిన రెండు మోటార్ల దాదాపు 160 మీటర్ల వైరు బుధవారం రాత్రి చోరీకి గురికాగా, రూ.30 వేల నుంచి రూ.40వేల నష్టం సంభవించిందన్నారు. దీంతో తాగునీటి సరఫరాకు స్వల్ప అంతరాయం కలుగగా, చోరీ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

స్కూల్ కాంప్లెక్స్‌గా కొనసాగించాలి

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్‌గా కొనసాగించాలి ఇంగళదహాళ్, పెద్దగోనెహాళ్, మడ్డిలింగద హళ్లీ (ఎం.డీ హళ్లి) గ్రామ పాఠశాలల పీఎంసీ చైర్మన్లు ఉరుకుందు, కొండయ్య, సునిత, కేసీ తిమ్మారెడ్డి యూత్, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల నాయకులు చంద్రశేఖర్, మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం వారు ఇంగళదహాళ్ జెడ్పీ హైస్కూల్ టీచర్లతో కలిసి స్కూల్ కాంప్లెక్స్ గురించి చర్చించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ 1964 నుంచి పాఠశాల కొనసాగుతూ 7.65 ఎకరాల విస్తీర్ణంలో బాలు వసతి గృహంతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇలాంటి పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఎందుకు తొలగించారని విద్యా శాఖాధికారులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాదానాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనసాగించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బాల్య వివాహాలను అరికడదాం

కృష్ణగిరి: గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టడం మనందరి బాధ్యత అని ఎంపీడీఓ మోహన్‌కుమార్, వైద్యాధికారి ప్రదీప్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సీడీపీఓ ల్యాక్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య, సచివాలయ ఉద్యోగులు, హెచ్ఎంలకు జరిగిన కిశోరి వికాస శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక, హింస, వేధింపుల నివారణ చట్టం గురించి వివరించారు. ఎంఈఓ–2 మద్దయ్య, ఏపీఎం మహేశ్వరయ్య, సూపర్‌వైజర్ సుగుణమ్మ పాల్గొన్నారు.

పశు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు నవీన్, రమేష్ కోరారు. మండలంలోని లక్కసాగరం గ్రామంలో గురువారం వారు ఉచిత వైద్య శిబిరం ద్వారా పశువులకు వైద్యం చేశారు. గతంలో గొర్రెలు, మేకలు మాత్రమే ఇచ్చే నట్టల నివారణ మందులు ఇప్పుడు పశువులకు కూడా ఇస్తున్నామని చెప్పారు. పశువులకు వచ్చే అన్ని రకాల వ్యాధులకు టీకాలు అందుబాటులో ఉన్నాయని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీజీబీ కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

పత్తికొండ రూరల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్రాంతినాయుడు ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తే ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. అలాంటి ఆలోచనను విరమించుకుని కడపలోనే కొనసాగించాలని కోరారు.నాయకులు హర్షవర్ధన్, రవి పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి

పెద్దకడబూరు : ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి సూచించారు. మండల పరిధిలోని చిన్న తుంబళం గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ ఖలీల్ గర్భిణులకు పశువుల కంటే హీనంగా వైద్యం ఇస్తున్నాడని అందిన ఫిర్యాదు మేరకు విచారణ నిమిత్తం గురువారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్ఎంపీ కోసం ఆరా తీశారు. కానీ సంబంధిత అర్ఎంపీ అందుబాటులో(గ్రామంలో) లేకపోడంతో హెల్త్ సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, అంతకు మించి రక్త పరీక్షలు చేయడం, సెలెన్ ఎక్కించడం వంటివి చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ తాహెర్, హెల్త్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సదరమ్ క్యాంపు

ఆదోని టౌన్: ఆదోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల(ఏరియా) ఆసుపత్రిలో మూడు రోజులపాటు నిర్వహించిన సదరం క్యాంపు ముగిసింది. రోజుకు 200 మంది చొప్పున మూడు రోజుల్లో 600 మందికి వైద్య పరీక్షలు చేశారు. గురువారం సదరమ్ క్యాంపులో దివ్యాంగులు, మానసిక రోగులు, చెవిటి, కంటి జబ్బులతో బాధపడే పింఛన్‌దారులు అనేక ఇబ్బందులు పడ్డారు. నంద్యాల, కర్నూలు ప్రాంతాల నుంచి వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఎన్నో వ్యయప్రయాసాలు ఓర్చి రైళ్లు, ఆటోలు, బస్సులు, అద్దె వాహనాల్లో ఆదోనికి చేరుకుని తమ పిల్లలకు పరీక్షలు చేయించుకుని తిరిగి వెళ్తున్నారు. నంద్యాల నుంచి ఆదోనికి రావాలంటే వందలాది కి.మీ. దూరం నుంచి పడరాని పాట్లు పడ్డామని వాపోతున్నారు. ఆటోలు, వాహనాల్లో రూ.4 వేల నుంచి రూ.5 వేల దాకా ఖర్చు అవుతుందని, రైలు, బస్సుల్లో ప్రయాణం రూ.వందల్లో ఖర్చు చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. దివ్యాంగులను పరీక్షించేందుకు ఇంత కష్టపెట్టాలా అంటూ పలువురు అసహనం వ్యక్తం చేశారు.



సదరమ్ క్యాంపు నుంచి తమ్ముడిని బయటకు తీసుకొస్తున్న అన్న ఫారూక్





పోతుగల్లులో మధ్యలోనే ఆగిపోయిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం, కంబాలపాడులో గ్రామ సచివాలయ భవనం పనులు మధ్యలోనే నిలిచిన దృశ్యం

ఎన్నటికి పూర్తయ్యేను?

- నిలిచిన గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు
- 8 నెలలుగా అందని బిల్లులు
- ముందుకు సాగని నిర్మాణ పనులు

కృష్ణగిరి: గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందించాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు పక్కా భవనాల నిర్మాణాలు సైతం చేపట్టారు. పలు చోట్ల భవనాలు పూర్తయ్యాయి. మరి కొన్ని చోట్ల అసంపూర్తిగా మిగాలాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలవుతున్నా నిర్మాణాలు పూర్తి చేయడంపై దృష్టి సారించడం లేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 14 గ్రామ సచివాలయాలకు గాను ఆరు సచివాలయ భవనాలు మాత్రమే పూర్తికాగా.. మిగిలిన 8 చోట్ల మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. మండలంలోని కృష్ణగిరి, తొగర్చేడు, టి. గోకులపాడు, అమకతాడు గ్రామాల్లో భవనాలు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. అయితే ఎరుకలచెరువు, లక్కసాగరం గ్రామాల్లో భవనాల పనులు పూర్తయినా, ప్రారంభానికి నోచుకోలేదు. కంబాలపాడు, పోతుగల్లు, చుంచు ఎర్రగుడి, చిట్యాల, కోయిలకొండ, కటారికొండ, ఆలంకొండ, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కాగా నాడు ఒక్కో భవన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.42 లక్షల చొప్పున మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి నిర్మాణాలను గాలికొదిలేసింది. నిర్మాణాలు పూర్తయిన వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కాగా భవన నిర్మాణాల పనులు ఎన్నటికి పూర్తవుతాయని సంబంధిత అధికారులను ప్రశ్నించగా.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే పెండింగ్ పనులు పూర్తి చేసి భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఎంపీడీఓ సమాధానమిస్తున్నారు.